క్లుప్తంగా

వన సమారాధనను విజయవంతం చేయండి

మామిడికుదురు: రాజోలు మండలం తాటిపాక సంఘం భవనం వద్ద ఈ నెల 3న జరిగే కార్తిక వన సమారాధనను విజయవంతం చేయాలని కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మామిడికుదురులో నయినాల కాశీ స్వగృహం వద్ద శుక్రవారం మండల సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ, గౌడ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన 3వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ వన సమారాధనకు పలువురు సంఘ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఆటంకం

మామిడికుదురు: సర్వర్ మొరాయించడంతో పింఛన్ల పంపిణీకి తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు, ఒంటరి మహిళలు పింఛన్ కోసం గ్రామ పంచాయతీలకు క్యూ కట్టారు. మా పింఛన్ ఎప్పుడిస్తారు. మేము ఇతర గ్రామాల నుంచి వచ్చాం. మళ్లీ వెంటనే వెళ్లి పోవాలి. అంటూ హైరానా పడ్డారు. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు పింఛన్ల పంపిణీ సజావుగా జరిగింది. అక్కడ నుంచి సర్వర్ మొరాయింపుతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. సర్వర్ పని చేస్తే పింఛన్లు పంపిణీ చేద్దామంటూ సచివాలయం ఉద్యోగులు గంటల తరబడి వేచి చూశారు. మామిడికుదురు మండలంలోని 22 సచివాలయాల పరిధిలో మొత్తం 9,9,95 మంది లబ్ధిదారులకు గాను అప్పటికి 4,099 మందికి అనగా 41.01 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. తిరిగి సాయంత్రం మూడు గంటలు దాటిన తర్వాత సర్వర్ పని చేయడంతో దేవుడా అంటూ ఉద్యోగులు పింఛన్ల పంపిణీకి లబ్ధిదారుల ఇళ్లకు పరుగులు తీశారు.

డ్రైనేజీల పరిశీలన



రాళ్ల మురుగుకాలువ అవుట్‌ఫాల్ స్లూయిస్ పనితీరు పరిశీలిస్తున్న చెంపాటి

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఏటిగట్టుకున్న డ్రైనేజీ సిస్టంల పనితీరును గురువారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు ఆధ్వర్యంలో నాయకులు రాళ్ల, నవా, గొంది డ్రెయిన్‌ల అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను పరిశీలించారు. అలాగే స్లూయిస్‌లకున్న తలుపుల పనితీరును చూశారు. డ్రైనేజీల ద్వారా పొంగి పొర్లుతున్న ఉప్పునీటితో దెబ్బతింటున్న కొబ్బరి, వరి సాగుపై వారు రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. జిల్లా డ్రైనేజీ సెల్ కన్వీనర్ కృష్ణరాజు, నాయకులు పోతురాజు సురేష్, బోణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



అంతర్వేదికరలో మంటలార్పుతున్న రాజోలు ఫైర్ సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో ముడకల మేరీ తాటాకిల్లు దగ్ధమైంది. పొయ్యి నుంచి ఎగసిన నిప్పురవ్వల వల్ల ప్రమాదం జరిగినట్టు వెల్లడయింది. ఆస్తి నష్టం సుమారు రూ.2 లక్షలు వరకూ ఉంటుందని అంచనా. రాజోలు ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకం పనుల్లో విధుల పట్ల అలసత్వం, నిర్లక్ష్య వైఖరి తదితర కారణాలతో ఎల్.గన్నవరం ఫీల్డ్ అసిస్టెంట్ సరెళ్ల సుబ్బరాజును డ్వామా పీడీ మధుసూదనరావు సస్పెండ్ చేసినట్టు ఎంపీడీఓ కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఎల్.గన్నవరం ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బరాజు గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడ్డాడని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని.. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఆ గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణతో పాటు మరికొందరు వ్యక్తులు గత సెప్టెంబర్ 3న అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారని ఎంపీడీఓ ప్రసాద్ విలేకరులకు తెలిపారు.

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రాజోలు: దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శుక్రవారం దళిత చైతన్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మండపేట మండలం ఏడిదలో ఎలాంటి కారణం లేకుండా దళితులపై దాడి చేయడం హేయమైన చర్యలు అని అన్నారు. దళితులపై దాడులు జరగడం పరిపాటిగా మారిందన్నారు. దళితులు సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని లేఖరి నాయకులు బత్తుల మురళీకృష్ణ, జనార్దనరావు, మట్టా సురేష్, చిలకపాటి శ్రీధర్, చింతా మధు, మందపాటి మధు, కలిగితి త్రిమూర్తులు, గొల్లమందల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్తికం.. శుభకరం

- నేటి నుంచి కార్తిక మాసం ఆరంభం
- ముస్తాబైన ఆలయాలు
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు



కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయం

కొత్తపేట: హిందువులంతా కార్తికమాసం నెల రోజులను అత్యంత పవిత్రమైన రోజులుగా భావిస్తారు. ఈ నెల రోజులూ భక్తితో భగవంతుని పూజిస్తే పుణ్యం, అష్ట ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అన్ని మాసాల్లో కన్నా కార్తికమాసం పవిత్రమైనదిగా వేదపండితులు పేర్కొంటారు. దీపాన్ని దైవస్వరూపంగా భావించి పూజలు చేస్తారు. దేవుడికి దీపాన్ని వెలిగించడంలో మన పూర్వీకులు వేదాంత విషయాన్ని స్పష్టంగా తెలిపారు. అంతటి విశిష్టత కలిగిన దీపారాధన కార్తికమాసంలో ప్రత్యేకంగా చేస్తారు. ఈ నేపథ్యంలో కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో గ్రామ గ్రామాన ఉన్న శివాలయాలు కార్తిక పూజలకు ముస్తాబయ్యాయి.

ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పలివెల ఉమా కొప్పేశ్వర క్షేత్రం

కొత్తపేట మండలం పలివెల గ్రామంలో వేంచేసియున్న ఉమా కొప్పేశ్వర క్షేత్రం పురాణ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వరస్వామి, రాజోలు నియోజకవర్గంలో కడలి కపోతేశ్వరస్వామి తదితర ప్రసిద్ధ ఆలయాలు ఈ నెల రోజులు భక్తులతో కిటకిటలాడనున్నాయి.

దీపారాధన ప్రత్యేకత..

కార్తికమాసంలో ఒక్కో రకమైన ప్రమిదలో దీపం వెలిగిస్తే ఒక్కో రకమైన మంచి జరుగుతుందని శాస్త్రాల్లో పేర్కొన్నారు. దానికనుగుణంగా మట్టి, పింగాణి, ఇత్తడి, కంచు ప్రమిదలతో పాటు నిమ్మ, ఉసిరి ప్రమిదలు, అరటి డిప్పలో దీపం వెలిగిస్తే మంచి ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఒక్కో రకం దీపారాధనకు ఒక్కో ఫలితం చెబుతారు. అలా దైవానుగ్రహం, ఇంట్లో ప్రశాంతత, సౌఖ్యం, సిరి సంపదలు, మానసిక ప్రశాంతత, ఆయుష్షు వృద్ధి, అన్నింటా విజయం, సుఖశాంతులు కలుగుతాయని పండితులు చెప్తుతారు.

కార్తికమాస పూజలకు సిద్ధమైన ముక్తీశ్వరుడు

అయినవిల్లి: కార్తిక మాసం ఆరంభం కావడంతో మండలంలోని ప్రాచీన శివాలయమైన ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వరస్వామివారి ఆలయం ముస్తాబైంది. ఈ ఆలయానికి పురాణ ప్రాశస్త్యం ఉంది. సీతారామచంద్రులు స్వామిని సేవించినట్లు చెబుతారు. అలాగే శమణి అనే మహిళకు మోక్షం ఇచ్చినట్లు చెబుతారు. ఈ ఆలయంలో కేశవస్వామి వారు, లక్ష్మీదేవి అమ్మవారు, ఆంజనేయస్వామివారు, క్షేత్రపాలకుడిగా కాలభైరవస్వామివారు కొలువై ఉన్నారు. అలాగే మండలంలోని అయినవిల్లిలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారు, తొత్తరమూడిలో మూలేశ్వరస్వామివారు, మాగంలో గౌతమేశ్వరస్వామి, నేదునూరులో చెన్నమల్లేశ్వరస్వామి, సిరిపల్లిలో కనకేశ్వరస్వామి కొలువై పూజలందుకుంటున్నారు. కార్తికమాసంలో ఈ ఆలయాల్లో స్వామివార్ల దర్శనం కోసం పోటెత్తుతారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయాలు విద్యుత్ కాంతులతో స్వర్ణకాంతులీనుతున్నాయి.



పలివెల ఉమా కొప్పేశ్వరులు

ఉమాకమండలేశ్వరస్వామి ఆలయ విశిష్టత

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పురాణ ప్రసిద్ధి చెందిన ఉమా కమండలేశ్వర స్వామి ఆలయానికి కార్తికమాసంలో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం నుంచి కార్తిక మాసం ప్రారంభం కావడంతో ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ ఆలయం ఎంతో ప్రాచీనమైందని క్రీ.శ 11వ శతాబ్దం నాటిదని సమాచారం. ఈ క్షేత్రం విశేషం తూర్పు ముఖంగా



ఉమాకమండలేశ్వర స్వామి

జగన్మోహినీ కేశవస్వామి, పడమర ముఖంగా శివాలయం ఉంది. ఇది ర్యాలి క్షేత్రంలో మాత్రమే ఉంటుంది. బ్రహ్మ తన కమండలంపై ఉమతో కూడిన ఈశ్వరుడిని ప్రతిష్ఠించాడని అందుకే ఆలయాన్ని ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంగా నామకరణం చేశారని పురాణాలు చెబుతున్నాయి. ర్యాలి ఆలయాలల్లో మరో విశేషం ఏంటంటే జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో స్వామి వారి పాదాల నుంచి గంగ ఉద్భవించడం, శివాలయంలో గంగ హరించుకుపోవడం భక్తులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

భగవతానుగ్రహం.. సంపూర్ణ ఆరోగ్యం..



కార్తికమాసం చాలా పవిత్రమైన మాసం. ఈ నెల రోజుల పాటు చేసే దీక్ష, పూజలు, వ్రతాలు, ఆలయాల సందర్శనం వలన భగవదానుగ్రహంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుంది. దీపారాధన చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. దీపారాధన ద్వారా ప్రశాంతత చేకూరుతుంది. హారతి వల్ల భక్తుల ప్రార్థనలు భగవంతునికి నేరుగా చేరతాయి. అంతే కాకుండా నెలరోజుల పాటు ఆలయాల్లో దీపారాధన చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది.

– పిడపర్తి రవికుమార్, వేద పండితుడు, పలివెల, కొత్తపేట మండలం

ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు పరం



వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు

మలికిపురం: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేశారని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించి దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి, ఏఐటీయూసీ నాయకులు దేవ రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. దిండిలో ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి. ఏఐటీయూసీ జెండాను యూనియన్ అధ్యక్షుడు కె.వెంకటేష్ ఆవిష్కరించారు. దేవ మాట్లాడుతూ ఏపీ టూరిజంతో పాటు అనేక రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ప్రైవేట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. సమావేశంలో సీపీఐ, ఏపీ టూరిజం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు కావాలంటూ ఎమ్మెల్యేకు వినతి



విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యేను కలసిన అంతర్వేది దేవస్థానం గ్రామస్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలోని బుంగవారి పేట, చొప్పలవారి గ్రూపులకు ఉన్న రింగ్ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని సదరు ప్రాంత వాసులు గురువారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. వారంతా విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి పై విధంగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై అధికారులతో చర్చిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చొప్పల నరసింహస్వామి, యడ్ల రజనీకాంత్, రత్నరాజు, జి.అన్నవరం, రేకపల్లి పండు, దుర్గారావు, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

దీపం పథకంతో మహిళలకు ప్రయోజనం

రావులపాలెం: దీపం పథకం మహిళలకు ఎంతో ప్రయోజనకరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన దీపం పథకం–2 ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: దీపం–2 పథకం ద్వారా రాజోలు నియోజకవర్గంలో 73 వేల మందికి లబ్ధి చేకూరుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో దీపం–2 పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీటీసీ దార్ల కుమారిలక్ష్మి, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: దీపం పథకం–2 పథకంలో నియోజకవర్గంలోని 4 మండలాల్లోని 73 వేల మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసినట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం అయినవిల్లిలో వినాయక గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శివశంకర్ ప్రసాద్, స్థానిక సర్పంచ్ కాకర శ్రీనివాస్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలు



మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చిట్టిబాబు

మామిడికుదురు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నగరం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని గురువారం కేశవదాసుపాలెం కాలువమొగ సెంటర్లో ఘనంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్రీనివాసరావుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు



రావులపాలెం: నిద్ర నాణ్యత సూచికకు సంబంధించి కళాశాల విద్యార్థుల వివరణాత్మక, గుణాత్మక ప్రతిస్పందన తులనాత్మక అధ్యయనం అనే అంశంపై తన అద్భుతమైన పరిశోధనతో రాజస్తాన్ విశ్వవిద్యాలయంలో డాక్టర్ పి.సంగమేష్ మార్గదర్శకత్వంలో వితనాల శ్రీనివాసరావుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) లభించినట్టు శుక్రవారం ఆయన తెలిపారు. ఈతకోట లిడియా ఫార్మసీ కాలేజీలో ఏడాగా పని చేస్తున్న ఆయన పీహెచ్‌డీపై మాట్లాడుతూ తన ప్రవచనం కళాశాల విద్యార్థుల నిద్ర నాణ్యతను పరిశీలిస్తుందన్నారు. ఈ జనాభాలో నిద్ర విధానాలను ప్రభావితం చేసే కారకాలపై సమగ్ర అవగాహనను అందించడానికి వివరణాత్మక, గుణాత్మక అంశాలను పరిశీలిస్తుందన్నారు. ఈ పరిశోధన విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లను హైలెట్ చేయడమే కాకుండా నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో విలువైన అంతర్ దృష్టులను అందిస్తుందన్నారు. ఇది విద్యా పనితీరు, శ్రేయస్సుకు కీలకమైదన్నారు.

సాధువులకు దుస్తుల పంపిణీ



అప్పనపల్లిలో సాధువులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సాధువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఏటా దీపావళి సందర్భంగా సాధువులకు దుస్తులు పంపిణీ చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముందుగా ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి బూరెలు సమర్పించారు. తదుపరి భక్తులకు వాటిని వితరణ చేశారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. ఆలయ ఈవో ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టు పరిశీలన



నగరంలో తాగునీటి ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

మామిడికుదురు: నగరం గ్రామంలో గెయిల్ నిధులు రూ.ఆరు కోట్లతో నిర్మిస్తున్న తాగునీటి ప్రాజెక్టును ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయని ఎస్ఈ తెలిపారు. మెయిన్ ట్యాంకులో ఉన్న మురుగు నీటి నిల్వలను బయటకు పంపించడం పూర్తి అయిందన్నారు. శనివారం నుంచి పంట కాలువ నీటిని ప్రాజెక్టు మెయిన్ స్టోరేజ్ ట్యాంకులోకి మళ్లిస్తామన్నారు. ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే దీనిని ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట డీఈఈ పద్మనాభం, ఏఈ జయశ్రీ, సర్పంచ్ జాలెం రమణ కుమారి, జాలెం సుబ్బారావు, కోళ్ల సురేష్ ఉన్నారు.

దీపావళి... ఆనందకేళి

కొత్తపేట: హిందూ సంప్రదాయ ప్రధాన పండగల్లో ఒకటైన దీపావళి పర్వదినాన బాణసంచా కాల్చి గురువారం ఆనందకాంతుల పండగ చేసుకున్నారు. దాదాపు ప్రతి ఇంటా దీపావళి రోజు గురువారం సాయంత్రం లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. పలు కుటుంబాల వారు ఆనవాయితీ ప్రకారం దివిటీలు వెలిగించారు. సాయంత్రం 6 గంటల నుంచి దీపావళి బాణసంచా కాల్చారు. ఈ పండగను కుల, మత, పేద, ధనిక, చిన్నా, పెద్ద తారతమ్యం అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం ఆనందంగా చేసుకున్నారు.

అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తం

దీపావళి బాణసంచా కాల్పుల నేపథ్యంలో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. స్థానిక అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏ విధమైన అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎక్కడ ఏ చిన్న అగ్నిప్రమాదం సంభవించినా హుటాహుటిన వెళ్లి ప్రమాదం నివారించేందుకు సిబ్బంది అందరూ ఫైర్‌స్టేషన్ వద్ద విధుల్లో ఉన్నారు. ఎక్కడా ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా దీపావళి ఆనందంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మలికిపురం: మండలంలో దీపావళి వేడుకలు గురువారం రాత్రి అత్యంత వైభవంగా ప్రజలు నిర్వహించుకున్నారు. ఇంటింటా దీపాలు వెలిగించి టపాసులు కాల్చి ఆనందంగా గడిపారు. మండలంలోని విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇంట దీపావళి ఘనంగా జరిగింది. బంధువులతో కలసి ఎమ్మెల్యే దేవ బాణసంచా కాల్చారు.

గృహోపకరణాల చోరీ

ఆలమూరు: గ్రామంలోని ఖండ్రిగపేటలో గత నెల 30 అర్ధరాత్రి వెండి వస్తువులు, గృహోపకరణాల అపహరణ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం స్థానిక ఖండ్రిగ పేట కాలనీలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పెంకుటిల్లులోని తాళాలు పగులగొట్టి అందులో ఉన్న వస్తువులను అపహరించారు. సుమారు రూ.మూడు లక్షల విలువైన 65 అంగుళాల స్మార్ట్ ఎల్‌జీ టీవీ, రెండు గ్యాస్ సిలిండర్లతో పాటు బీరువాను పగులగొట్టి అందులో ఉన్న విలువైన దుస్తులు, అరకిలో వెండి వస్తువులను దొంగిలించారు. అయితే ఆ ఇంటి యజమానులు జీవనోపాధి దృష్ట్యా కాకినాడలో ఉండటంతో ఈ చోరీ సంగతి ఆలస్యంగా తెలిసింది. దీనిపై బాధిత కుటుంబసభ్యులు చూపుల శ్రీనివాసు, పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ఆధునీకరణ పనులు ప్రారంభం

పి.గన్నవరం: అంబాజీపేట–పి.గన్నవరం రహదారి ఆధునీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. రూ.8 కోట్లతో నిర్మిస్తున్న ఈ రోడ్డు ఆధునీకరణ పనులను శుక్రవారం ఆయన పి.గన్నవరంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆక్రమణలను తొలగింపు విషయంలో రాజీ లేకుండా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రోడ్డుకు ఒక వైపున డ్రైనేజీకి రూ.40 లక్షలు మంజూరైన నేపథ్యంలో దాని పనులను ప్రారంభించాలని సూచించారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ 900 మీటర్ల పొడవునా 10 మీటర్ల వెడల్పున సిమెంటు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. అక్కడి నుంచి అంబాజీపేటకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. పోతవరం సమీపాన 150 మీటర్ల మేర రోడ్డుకు రక్షణ గోడ నిర్మిస్తున్నట్టు వివరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల వీవీ సత్యనారాయణమూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు తుది గడువు 6

అంబాజీపేట: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఓటరు నమోదుకు గడువు ఈనెల 6తో ముగుస్తోందని అర్హులైన పట్టభద్రులు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ జె.వేంకటేశ్వరి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టభద్రులు 2022 అక్టోబర్ 31కి ముందు డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫారం 18 లో తమ వివరాలను నమోదు చేసి, దాంతో పాటు డిగ్రీ, ఇంటర్, పదో తరగతి సరిఫికెట్లను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి జత చేయాలన్నారు. వీటితో పాటు ఆధార్ కార్డు, ఓటర్ కార్డు జెరాక్స్ కాపీలను కూడా సమర్పించాలని సూచించారు.ఆసక్తి కల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దార్ వేంకటేశ్వరి సూచించారు.

ఎంపీడీవోగా రాజు



ఆలమూరు: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎ.రాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులను వెలువరించింది. జెడ్పీ సీఈఓ ఆదేశాలతో ఎంపీడీఓగా రాజు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన రాజును ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, పలువురు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాజోలు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కడలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా శుక్రవారం సూచించారు. పీఎంశ్రీ నిధులతో చేపట్టిన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలకు ఎదురుగా ఉన్న ఆటస్థలంలో మెరక పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు డీఈఓ సలీం బాషాను కోరారు. పాఠశాలలో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకుల నియామకం, సిలబస్ వంటి అంశాలపై చర్చించారు. సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు, ఎంఈఓలు నల్లి మనోహరం, ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎస్.ఎస్.శర్మ పాల్గొన్నారు.



కడలిలో ఆటస్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఓ షేక్ సలీంబాషా

అమరజీవి.. ధన్య జీవి



అంబాజీపేటలో శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అంబాజీపేట: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ధన్య జీవి అని స్థానిక ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాసు శ్రీనివాసరావు, గోకవరపు శివ అన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తెలుగువారికి భాషా ప్రయుక్తంగా ఒక రాష్ట్రం కావాలని డిమాండ్ చేసి ఆమరణ దీక్ష చేపట్టి అసువులు బాసిన మహామనిషి పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు



అంతర్వేది ఆలయంలో పవిత్ర జలాల కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ప్రధాన అర్చకుడు కిరణ్

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని శుక్రవారం స్వామికి అష్టోత్తర కలశాభిషేకం అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ఠ గోదావరి నది నుంచి తెచ్చిన పవిత్రజలాల కలశను శిరస్సుపై ధరించి ప్రధాన అర్చకుడు శ్రీనివాస కిరణ్ ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం 108 కలశలలో ఉంచిన జలాల్లోకి స్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశల్లోకి ఆవాహన చేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో నారసింహ, సుదర్శన హోమంలోను అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీమా ఏజెంట్ల నిరసన

రాజోలు: ఎల్ఐసీ ఏజెంట్లు స్థానిక కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. గత నెల 7వ తేదీ నుంచి దశల వారీగా నిరసనలు చేపట్టినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాలసీలపై పెంచిన ప్రీమియం రేట్లు తగ్గించాలని, ఏజెంట్లకు తగ్గించిన కమీషన్ యథావిధిగా కొనసాగించాలని కోరారు. లక్ష రూపాయల పాలసీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజోలు బ్రాంచి అధ్యక్షుడు అడబాల శ్రీనివాసరావు, కార్యదర్శి కడలి వేణుగోపాలకృష్ణ, కోశాధికారి రావి విజయ్, కోళ్ల ఫణి గంగాప్రసాద్, తోలేటి బాబ్జి, పులుసుగంటి వెంకటేశ్వరరావు, కొణిదల వీరాంజనేయులు, వీబీబీ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.